

కూరలసంచి తిరగవేసింది సుందరి.

బంగాళా దుంపలు, ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిరపకాయలు ఉన్నాయి. తను దుసమ్మ అని, 'బజారుకు వెళుతున్నాను కూరలు తెస్తా'నంటే పని తొందరలోవుండి, 'ఊ' అంది. కేలండరు చూచి 'ఇవ్వాళ ఏకాదశి, ఉపవాసం' అని కూడా అంది. తను అనుకోవడం, ఏ అరటిపళ్ళో, బత్తాయిలో తెస్తారు అనుకుంది. గత్యా అవి మానేసినా, రాత్రివరకు ఉపోషం ఉన్నప్పుడు, నైవేద్యానికైనా పనికిరాని బంగాళా దుంపలు తేవడంలో కోపంవచ్చింది. కనీసం చప్పడి పిండిలో వ్యంజనంక్రింద కూడా.

"ఏకాదశి అని చెప్పానుకదా ఏమిటీ కూరలు తేవడం?"

"అవి పనికి రావా?"

"ఉపోషంవుండి, బంగాళాదుంప కూరా వండేది? అదికూడా ఉల్లిపాయల్తోనా? అసలు ఏకాదశినాడు ఉల్లిపాయి ముట్టుకోడానికైనా హక్కు వుందండి?"

"ఏకాదశా! ఎవరికి? మాకు ఏకాదశి లేదు రాకాదశిలేదు. మాట్లాడకుండా మసాలా కూరవండు. రెండు పూట్లకు సరిపోతుంది."

"ఏం మాట్లాడుతున్నారు." ఏకాదశి లేదు. గత ఆరు సంవత్సరాలనుండి ఉపోషాలు ఉంటున్నానని తెలిసికూడా, ఇంత మొండి పట్టు పట్టడంలో అర్థం ఏమైనా ఉందా?" ఓ విధమైన ఉక్రోషంలోనే అంది. పైగా ఆయన అటు వెళ్ళగానే, వడవడలాడుతున్న వంకాయలు, సవాసేరు అణా అంటూ వస్తే వెళ్ళకొట్టింది. వాటిని చూచినప్పుడు రాత్రికి ఇగురు పచ్చడి

# ★ స్ఫటికాలు ★

చెయ్యాలి అన్న నోరూటకూడా కల్గింది. ఇప్పుడు చేతులు కాలినట్టే అయింది.

"చేశావయ్యా! చెప్పకు నేందుకు చేశావు. ముందు తింటానన్న వదినిగారిలా, ఆచరించేవు. ఎవరాచరించమన్నారు? పైగా మా శాఖలో ఏకాదశి అసలు వుండనే కూడదు. అందుకే మానెయ్యమంటున్నా" అన్నాడు. అందులో వెటకారం పూర్తిగా వుంది.

చక్రుమని లేస్తూ "అందుకే మా వాళ్ళు మీతో సంబంధం చెయ్యడానికి చాలా తటపటాయించారు. లింగధార్లతో సంబంధం గంగలో దూకినట్టే అనుకుని."

"పోనీ ఇప్పుడు విడాకు లిచ్చి ఓ స్మార్త మహనీయుని ఉద్వాహం ఆడు" గట్టిగా నవ్వేస్తూనే అవేశాడు సీతారామయ్య.

ఉరేసుకున్నట్టే అయింది సుందరికి. అప్పుడు, ఆ రోజుల్లో సంబంధాలకోసం కాళ్ళరిగా తిరిగేరు. ఒక్కటంటే ఒక్కటి అన్నీ సరిగ్గా వున్నవి దొరకనే లేదు. చూడానికి వచ్చిన వ్యక్తులు వృకోదరుడులాగో, వల్లె జీడి పిక్కలాగో వుండడం, ఉప్పంటే కారం లేకపోవడంతోటి, సమానశాఖలో ఎవరూ దొరకనే లేదు. ఇంక తప్పని సరిగానే ఇతర శాఖల్లోకి వెళ్ళడం, ఆఖరికి ఈ లింగధార్ల సంబంధం, చూపులకు పిలవడం జరిగింది.

అప్పుడుకూడా వాళ్ళమ్మ లింగధార్లు అంటే, వాళ్ళ ఆచారాలు, నమ్మకాలు, రౌద్రాలు, పూజలు, ఆరాధనలు, ఇవన్నీ కూడా, ఆ వాళ్ళవంశంలో వుంటాయని ఆందోళన పడిపోయింది. మనస్ఫూర్తిగా ఒప్పుకోలేకపోయింది.

ఓ వేళ ఇవ్వే వుండినట్లయితే, తనకూతురు మెళ్ళో లింగకాయ, మడులు, పూజలు, గంటలు, శంఖాలుకూడా తయారవుతాయనే భయపడింది. అందుకనే, ఆ చూచివచ్చిన వాళ్ళని తరచితరచి ప్రశ్నలు వేసింది. ఆ అబ్బాయి హాస్టల్ కాస్మాపాలిటన్ సెక్షనుకు సెక్రటరీఅంటేనూ, పూజలు పునస్కారాలు లేని యువకుడంటేనూ, కొంత అనునయం పొందింది. మనస్సు ఒగ్గింది.

చూపులకు వచ్చినరోజున, సింహాచలేశ్వరుడిలా వున్న, ఆవగ్రకాపింగు, సూటుతో వున్న మనిషిలో, లింగధారిత్వం ఏ కోశానా ఉండదు అనుకుని 'ఊ' అనేసెయ్యవలసిన పరిస్థితి వచ్చింది.

లోపలికి వస్తూనే అడగ్గా అడగ్గా 'వచ్చారు' అన్న కూతురుజవాబుల్లో స్మార్తత్వానికి సమాధికట్టింది వెరుపులోనే. ఆతర్వాత సంవత్సరాల్లో కళ్ళల్లో కలికంపెట్టుకుని, కూతురు స్మార్తులోంచి, లింగధారుల్లోకి ఎంతవరకూ వెళ్ళిందో సింహావలోకనం చేసుకుని, మార్పులు లేకపోవడంతో తృప్తిపడింది. అది వ్యక్తపరచింది ఉత్తరాల్లో.

కాని కొన్ని నెలలనుండి, అప్పుడప్పుడు ఇటువంటి వైరిముత్తికోళ్ళ వ్యవహారాలు తలఎత్తడంతో సుందరికి, ఇన్నాళ్ళనుండి లింగధార్ల ఛాయల్లోకి వెళ్ళకుండా తన బిరిలోనే ఉన్నాననుకున్న భావానికి, ఆఘాతం తగిలింది. అయినా ఏదో పురుషలక్షణంగా ఈ పొలపొంగులు తప్పవు అనుకుని తుడిచేసుకుందామనుకున్నా, రెండేసి రోజులకు ఒక్కొక్కసారి శతిమెండి, సహస్రమొండిగా అవడం తలనొప్పిగానే వుంది. కట్టుకున్న మేడలు ఒటివా అన్న సంశయమూ కలిగింది.

గత ఆరువత్సరాలసంసారంలోనూ ఆయన ప్రవృత్తిని అంచనా వేసి, ఆఖరికి గురిగింజ ప్రమాణంలో తూకం వేస్తే, అంత భారీమనిషిలోనూ ఓవిధమైన పిరికితనం, తన్ని తానే సందేహించడం ఉండిపోయాయి. ఆస్థితే ఉముకున్నప్పుడు మనిషే మారిపోయి, "బూచాడు వస్తున్నాడు" అంటే చిన్న పాపాయిలు, కళ్ళు మూసుకుని కిక్కురుమనకుండా వున్న సితిలోకి వెళ్ళినట్టే అయిపోతాడు. అప్పుడప్పుడు జాలికల్గి, పొత్తిళ్ళల్లో పాపాయిలాగే తినుమాతృత్వం వహించడంతో అంతమయ్యేది.

ఇదే మనిషి బరిలోకి దిగితే, కొండ విరిగి నెత్తిమీదపడినా వెనక్కు తగ్గడు. ఆ కార్యాంతం కళ్ల చూస్తేనే కాని వదలడు. అంతధైర్యం, చొరవ, గుండెనిబ్బరం కలవాడు. తనకే ఆశ్చర్యంకల్గేది-ఆసమయాల్లో. తిండీ నిద్రా అక్కర్లేకుండా మునిగిపోయిన వ్యక్తినిచూస్తే.

ఈవిభిన్న ప్రవృత్తులుగల మనిషితో తను ఖరాఖండీగా ఏదైనాఅంటే తప్పకుండా వ్యతిరేకంచేసి కూర్చుంటాడని తెలుసు. అల్లా నోరుజారి అన్న అంశాలు, వాటి ఫలితాలు చాలా వుండిపోయాయి ఇదివరలో.

ఇప్పుడు లింగధార్లు, స్మార్తులు అన్న ఎరమరికతో మాట్లాడినా, ఒక పంథాను తను బలపరచినా, ఎదురు చుక్కగా కూర్చోడం తటస్థిస్తుంది. అప్పుడు మరి ఇరుకున పడిపోవలసివస్తుంది.

"విడాకులు ఇవ్వవలసిన రోజున ఇస్తాను లెండి" అంటూనే కూరలన్నీ బుట్టలోకి ఎత్తి వంటింట్లోకి వెళ్ళింది.

కుర్చీలో కూలబడుతూ నవ్వుకున్నాడు సీతారామయ్య. సుందరికి కోపం రావడం ఒక రంగం. దాన్ని ఆమె ప్రదర్శించడం రెండో రంగం. ఇది పరిపాటే అయినా, ఆ కోపంలో అనేమాటలు, చేసే పనులు చూస్తుంటే, ఇంట్లో పిల్లలు లేనికొరత తీరినట్లుగా వుండేది. సుందరి ఓ చిన్న అమ్మాయి, తానూ అలరి పిల్లాడు అవడం, తుని తగవుగా, కాకి ఎంగిలిచేసినట్లు రాజీపడడం, ఏదో కొంత మిరియపు పొడినోట్లో వేసుకున్నట్లుగా వుండేది. ఇప్పుడుకూడా...

ఒక్కటే మాత్రం నిలదీసి అడిగినట్లుగా 'లింగధార్లు' అని పదే పదే అనడం మనస్సులో బాధపెట్టేది. ఏ ముని ముతాతల నుంచో తన వంశంలో లింగధారిత్వం అవలంబించారు. అది వంశపారంపర్యా, స్థిరచర ధారణల్లో ఉండిపోయి. ఆస్తులతోపాటు సంక్రమణల చేయడం జరుగుతూనే వుంది. రాను రాను ఆచరణల్లో మార్పులువచ్చినా, భక్తి తగ్గినా, తమ వంశం వాళ్ళందరినీ లింగధార్లక్రింద జమవేసింది లోకం. తామూ అలాగే వుండిపోయారు.

ఆ మొదటినాటి తాతల ఆచారాలు తాను నిత్యజీవితంలో అమలుపెట్టనే లేదు. తనతండ్రి తల్లీ కూడా ధారణ అయి, ఆయనను యజ్ఞోపవీతంలోనూ, ఆమెను సూత్రాలలోనూ స్థిరంగానే వుండిపోయాయి. అంతే. ఏ నైవేద్యానికో ఇవి బయటకు ఓసారి, అంతఃపురస్త్రీలలా దర్శనం ఇచ్చి, క్షణకాలం జ్ఞాపకంచేసి, మళ్లా పర్దాల వెనకాల దాక్కొని పోతాయి. తీరా తనకి మాత్రం ఆ రాణివాసపుస్త్రీల సౌందర్యం పట్టనే లేదు. ధారణ అవను కూడా అవలేదు.

ఇటువంటి పరిస్థితుల్లో సుందరి మాటిమాటికి దెప్పిపొడవడంలో ఔచిత్యం కన్పడలేదు. పైగా చికాకు కల్గిస్తోంది. నిలదీసి అడిగితే తన ద్వేషకారణం ఏమిటో తెలియదు. చెప్పనూలేదు. ఏకాదశి, శనివారాలు ఆదివారాలు, కార్తీకనకాలు ఇవన్నీ కూడా ఆరోగ్యసూత్రాలు అని శాస్త్రరీత్యా తను చెప్పితే వినదు. పైగా పులాజాల్లోంచి ఏయేరోజుల్లో, ఏయే తిథుల్లో ఎల్లాంటి వ్రతాలున్నాయో, అవన్నీ ఏకరువుపెట్టి, 'ఈమాత్రం తెలియని వాళ్ళకు బి. ఏ పటా ఆ యూనివర్సిటీ వాళ్ళు ఎల్లా ఇచ్చారండి' అని న్యూనత పెట్టేస్తుంది.

ఈనాటి ఎత్తిపొడుపుకు కారణం ఏమిటా అని ఆలోచిస్తే పదిరోజులక్రితం వాళ్ళనాన్నగారు కాశీనుండి రెండు స్ఫటిక లింగాలు తెప్పించాలి. ధారణకు ముహూర్తం పెట్టమని మహేశ్వర్లుగార్కి ఉత్తరం వ్రాశేను అన్నదే అని అవగతం అవుతోంది. అది చూచిన తర్వాత శాస్త్రి అమ్మగారికి ఉత్తరంవ్రాయడం, ఆవిడ జవాబువ్రాయడం తనకు, తెలియని విషయాలక్రింద వున్నా,

సారాంశం పై విషయాన్ని కూర్చే అన్నది నిరుకు. దాని ఫలితంగానే సుందరి సెకండు గ్రంటు మొదలెట్టింది అన్నది నిజం.

భోజనం దగ్గర కూర్చున్నప్పుడు, కొత్త అవకాయ, కందిపొడుం తప్ప ఆరోజు ఇంకొకటి నోచుకోలేకపోయాడు సీతారామయ్య. ఉత్తరజౌపోసనం చుడుతూనే "మాఘమాసంలో సెలవు దొరుకుతుంది. ముహూర్తం పెట్టించమని మా నాన్నగారికి వ్రాస్తున్నా" అన్నాడు.

సుందరి గొడకు, గుడ్డప్పగించి జార్లపడింది బట్టలేసుకుంటున్నప్పుడే, కళ్ళు ఎర్రపడి, నీళ్ళు తుడుచుకున్నట్లుగా అనమాళ్ళు ఉన్నాయి

మెట్లు దిగేటప్పుడు అప్రయత్నంగా ఇండియన్ కాన్‌సిట్యూషన్ జ్ఞాపకం వచ్చింది. ఆవిడకు 'రిట్' దాఖలు చెయ్యగలిగిన అధికారం వుంది అనిపించింది.

*　　*　　*

ఆరోజు ఆఫీసునుండి వచ్చేటప్పటికే పెట్టె, బెడ్డింగు కట్టింది. ఉదయం తను చూచాయగా అనుమానించాడు. పైగా అది అత్తగారి ఉత్తరం రావడంవల్ల నిరుకూ అయ్యింది. మాఘమాసం దాకే వరకు తనకి వంటిల్లు అప్పచెప్పి వెళ్ళిపోతే, కత్యాగత్యా ఆ వచ్చే వర్షాలన్నీ కూడా దూరంగా వుండే ఎగుగ్గొట్టవచ్చు అన్న ఉద్దేశ్యం కూడా మిళితమై వుందన్నట్టే తట్టింది.

"నేను మావూరు వెళ్ళుతున్నా" ముభావంగా అన్నది.

"రాత్రి బండికేనా?"

"అవును."

"ఎందుకూ?"

"మా అమ్మ అర్జంటుగా రమ్మంది."

ఘక్కున నవ్వాడు. కొరకొరా చూచింది ఆవిడ.

"మాఘమాసంలో ముహూర్తం దూరంగా వుంటే తప్పించుకోవచ్చనేగా వెళుతుంట."

"కాదు. కట్టకున్న తర్వాత ఏం చేసినా తప్పదు. దానికోసం ఏం పారిపోవటంలేదు"

"మరి?"

"మా అమ్మ రమ్మంది."

"మీ వూరు నుండి మా వాళ్ళింటికి కెళ్తావా?"

ఆవిడ మాట్లాడదు అనుకున్నట్టే మాట్లాడలేదు. అత్తవారింటికి అంటే ఏదో రాసి రంపాన్ని పెడతారన్న భావం కోడళ్ళలో ఈ నాటికి ఎందుకు పాతుకుపోయిందో అర్థం కాలేదు. ఇదివరకూ చాలాసార్లు ఆవిడ వెళ్లకుండానే వచ్చేసింది. అనుకున్నట్లుగానే సుందరి వెళ్ళిపోయింది. రైలు ఎక్కించి వచ్చినతర్వాత, ఇంటికివస్తే బావురుమనిపించింది. దీనికి కారణం తనే అని తట్టింది.

ఇంట్లో ప్రతిమూలా సుందరి ప్రతిబింబం అన్నట్లుగానే, విషహితంగా బొమ్మలు, పటాలు, విగ్రహాలు ఉండిపోవడం చికాకెత్తించింది. వాటిల్లో వుండి తనని, తన శైవమతాన్ని వెక్కిరించినట్టే తట్టింది తను మన సారా కొనుక్కొని తెచ్చుకున్న లింగా, కారం, కవుడి సింహాసనములో, కనపడకుండా, ఏదో తీసి పారేసినట్లుగా ఉంచడం ఒళ్ళు మండించింది. వెంటనే అసామ్ప్రదాయపరంగావున్న విగ్రహాలన్నిటినీ ఏరేసి-చీడపురుగుల్లాగే సామాన్ల పెట్టిలో అడుగునపారేశాడు, పటాలన్నిటని పాత బుట్టలో అడుగున పడేశాడు స్నానంచేసి, శివలింగాన్ని పూజచేసి, నైవేద్యానికి నాలయిదు రకాల పళ్ళు పెట్టాడు. ఓవిధమైన తృప్తికలింది. బజారున పడి, శివసంబంధంగా వున్న విగ్రహాలు, పటాలు దొరుకుతాయేమో అని వెతికి, రెండు



బోసినవ్వు

ఫొటో: కె. సన్యాసిరాజు, కోటవురట్ల

మూడు పట్టుకు వచ్చేడు. వాటిని ఆయా స్థలాల్లో పెట్టి ఆనందం పొందాడు.

ఆ ఒంటరిగావున్న కాలంలో రోజూ ఆఫీసునుండి వచ్చేటప్పుడు, మారేడుదళాలు, పారిజాతపువ్వులు, మందారాలు, నందివర్ధనాలు తెచ్చేవాడు. దొడ్లోవున్న శంఖుపువ్వులు జతపర్చేవాడు. తృప్తిగా పూజ జరుగుతోంది, శివప్రీత్యర్థంగానే పువ్వులు దొరుకుతున్నాయి అన్న ఆనందం వెల్లివిరిసింది.

ఎందుకో ఆ చదువం చేస్తున్నప్పుడు, గాయత్రి చదివినపుడు, వాట్ల అర్థం, అవగాహనకాని తాత్పర్యాలు స్మార్త స్వాధీనాలేమో అని తట్టేవి. అల్లాంటివి చదవడం, అవిచదువుతూ పూజ చెయ్యడం, హారతి ఇవ్వడం, తెలిసివుండీ— మిడి మిడి జ్ఞానంలో అయినా — చెయ్యడం, తన శివమహారాజ్‌కే ద్రోహం అని మనస్సు పూర్తిగా చెపితే, మానేశాడు. ఒక్క పంచాక్షరీతోనే శుది, మొదలు కూడా ఆచరించడం మొదలుపెట్టాడు.

ఇదివరకూ పూజ నిత్యమూ చేసేవాడు. ఇప్పుడూ చేస్తున్నాడు — అప్పుడు అచంచలంగాను, ఇప్పుడు కేంద్రీకృతంగానూ, పూర్తి శివపరంగాను మామూలుగా దిన దినగండంగా వుండే ఆఫీసుకృత్యాలు సాఫీగా పోవడంతో, తనుచేసే పూజలు ఒరి నేపోవడం లేదనిపించింది.

దాంతో సోమవారాలుండడం, ప్రారంభించేడు. రాగి పంచపాత్ర ఉద్ధరిణీ కొన్నాడు. శంఖం ఎక్కడైనా దొరుకుతుందేమో అని ప్రయత్నించేడు. నందీశ్వరుడు పైనవున్న ఘంటా కొన్నాడు, ఉల్లిపాయలు విసర్జించాడు. హోటళ్ళల్లో మాలకూడు తినడం ఎందుకని ఇంట్లోనే చెయ్యికాల్చుకున్నాడు. ఆ ఎక్కువ తక్కువ వ్యంజనాలనే నైవేద్యంపెట్టేడు శివపురాణం చదివేవాడు నిత్యం.

ఇన్ని చేసినా, శ్వశికతంగా అన్నీ ఆచరించినా, సుందరి సంగతి మాత్రం సమస్యగానే వుండిపోయింది. ఆవిడ కొనుక్కున్నవి, తెచ్చుకున్నవీ కూడా, ఇప్పుడు బొద్దింకలతో, చిమ్మటాలతో, మగిపోవడం, పైగా ఎక్కడ లింగధారణ చేయించడం జరిగిపోతుందో అని ఆవిడ వుడాయించడం, ఎంతగా మర్చిపోదా మనుకున్నా, విపరీత న్యాయాల్లో అవి కుక్కగొడుగుల్లా విస్తరించేవి

ఒక్కొక్కరాత్రి ఉలిక్కిపడేవాడు. బ్రహ్మ. విష్ణువు, పాండురంగడు, వెంకటేశ్వరస్వామి, నృసింహస్వామి, కంచి కామాక్షి, వీరంతా కూడా, తనచుట్టూ మూగి నవ్వినట్లు, హేళన చేసినట్లు, ఎవరో అంకుశాలతో పొడిచి చిత్రవధ చేసినట్లుగానే కలలు వచ్చేవి. భయంతో చెమటలు పోసేవి. ఒణికిపోయేవాడు. 'శివ శివా' అని ఎంత స్మరణచేసినా ధైర్యం కలిగేదికాదు. అయినా మార్కండేయులు, కామదహనం, పరాశక్తి లీలలు, గంగావతరణం ఎన్నికథలు మననం చేసుకుందామనుకున్నా, మధ్యలో విష్ణుపర్యాయ అంశాలు పుములుకు నేవి. గజిబిజిగా మనస్సు వుండడంతో మరింత ఉద్రేకంగా పూజలు చేసేవాడు.

అయినా ఒక మహాసాగర తీరాన తను ఓబుడ్డి చెంబులో నిల్చివున్నట్లే అయింది. దాన్ని నింపుకోడానికి, ధైర్యం లేనట్లు తట్టేది.

ఆరోజు 'కాశీనుండి రెండు స్ఫటిక లింగాలు వచ్చాయి. మహేశ్వర్లు వారు రామేశ్వరం వెళ్ళారు. వారు వచ్చేటప్పటికి

# ★ స్ఫటిక కోలు ★

మాఘం వెళ్ళిపోతుంది...” అన్న ఉత్తరం రావడంతో, తనకు ఓవిధంగా ధైర్యం వచ్చింది. సుందరికి తు చా తప్పకుండా ఆ విషయాలన్నీ సంపుటీకరించి ఉత్తరం వ్రాశాడు.

అంగలు వేసుకుంటూ వెళ్ళి పోస్టులో వేసివచ్చేడు.

*    *    *

ఆ సోమవారం అనుకోకుండా ఉత్తరం వచ్చింది సుందరి దగ్గరనుండి. “మొన్న ద్రాక్షారం భీమేశ్వర స్వామి ఆలయం చూడ్డానికి వెళ్ళాం. వచ్చే శివరాత్రికి అమ్మా వాళ్ళూ శ్రీశైలం వెళదామనుకుంటున్నారు. నేనూ వెళుతున్నాను...” తెల్లబోయాడు. ఈ శివపుణ్యక్షేత్రాలసందర్శనంలో, ఈవిడకి ఇంత అవ్యాజ కుతూహలం ఎందుకు కల్గిందని? గజిబిజి అయింది. పైకి ఎలావున్నా సుందరి మానసికంగా శివమతం అంటే భక్తిప్రపత్తులు కలిగినదేమో అని. ఇది తప్పేసరికి తన ప్రతీకారవాంఛ ఎంత ఓటికుండ వతులో వుందో అని వెక్కిరించినట్టే అయింది.

తట్టుకోలేక పోయాడు. మనస్సు వికలమైంది. ఒక్కసారిగా పెట్టెలో తను బంధించిన స్మార్తదేవతా విగ్రహాలన్నీ తలోమూలా నుంచుని ప్రశ్నించినట్లు తట్టింది. ప్రదోషం, పైగా సోమవారం అని కొబ్బరికాయ వగైరాలన్నీ కూడా తెచ్చుకున్నాడు. పీటమీద కూర్చున్నప్పుడు, ఆచమనం చేసేటప్పుడు కూడా, పరిపరి విధాలుగా మనస్సు భయపడింది. ఊగిపోయి బీభత్సం అయింది. పెనుమిత్తిలా ఏదో అతీతశక్తి పనిచేస్తున్నట్లు అయితే, లేచి వెంటనే. ఆ విగ్రహాలన్నీ తీసి తోమి, గంధాలంకృతం చేసి సింహాసనంలో పెట్టాడు. అంతవరకూ మనస్సు కుదుటపడనేలేదు.

గాయత్రి చదివేడు. సక్రమంగానే దీప ధూప నైవేద్యాలు సమర్పించాడు.

ఆరాత్రి వ్యక్తావ్యక్తంగా శివస్తోత్రంలోని “ఏషు రూపేషు, యత్ ప్రీతి స్తత్ ద్రూపం బిభర్షిహి” జ్ఞాపకం వచ్చింది. మననమూ అయింది.

*    *    *

అనుకోకుండా ఆ శివరాత్రి దాటిన వారానికి సుందరి ఊళ్ళోకి దిగింది. వచ్చీ రావడంతోనే, స్నానంచేసి, తను కొనుక్కువచ్చిన విగ్రహాలు, పటాలు అన్నీ తీసింది. అవన్నీ కూడా మయూరాసనంలో సర్దింది. ఓసారి చూచాడు. ఒకటి తర్వాత ఒకటి అన్నీ కూడా శైవసంప్రదాయానివే.

హడలిపోయాడు. తీరా తనకితనే నిలదీసి ‘నువ్వు, నీపూజ ఎందుకోయ్ !’ అన్నట్టు ప్రశ్నకన్పిస్తే, చెప్పలేని ఆవేదనలో కళ్ళు చెమర్చుకున్నాడు.

*    *    *

అమర్నాడు ఏకాదశికదా అని బజారుకు వెళ్ళేడు. పళ్ళూఫలాలు తెచ్చేడు. సంచీ తిరగబోసేటప్పుడే సుందరి ఫక్కున నవ్వేసింది.

“ఎందుకూ ?”

“ఏకాదశిగా”

“ఏకాదశీలేదు గీకాదశీలేదు. శుభ్రంగా సాంబారు పెడతాను. అరటికాయ వేపుడు. భోంచేసేద్దాం” అంది.

‘రావుల్ దప్పి’ అన్నట్టు అయ్యింది గోడకు చేర్లపడ్డాడు. ఎదురుగా వ్రేళ్ళాడుతున్న సింహాసనం. అందులో విగ్రహాలు... వెక్కిరిస్తున్నట్లుగా...ఉండలేక వీధిలోకి వచ్చాడు...

ఇంతకీ తను శివభక్తుడా, స్మార్తుడా ఇదే విరుకుకాలేని సమస్య అయ్యింది. క్షుభితం అయ్యింది మనస్సు...

తనో పాషండుడు అనుకుంటూనే తిట్టుకున్నాడు.

వీధిలో జండాలు...పెద్దపెద్ద బోర్డులు ‘బుద్ధజయంతి’ అని...

ప్రపంచంలో చరిత్ర పునరావృత్తి అవుతుందట. అల్లాగే తనూనా...

ఈనాటికీ ఆ తెప్పించిన లింగాలు పెట్టెల్లోనే వుండిపోయాయి. ★


మనోహరమైన కేశములకు
సులభమైన కిటుకు

తాతావారి
సుగంధిత కొబ్బరి
తలనూనె
మరియు
షాంపూ



ధి తాతా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్